**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విలేకరులుగా పనిచేయడానికి ఆహ్వానిస్తున్నాము. సామాజిక దృక్పధం, అవినీతి, అక్రమాలపై అక్షర గళాన్ని వినిపించే దమ్మున్న విలేకరులు 'అక్షర వెలుగు' తెలుగు దిన పత్రికలో పని చేయడానికి ఈ క్రింది మేయిల్ అడ్రస్‌కు వివరాలను పంపండి

Mail: aksharavelugudaily@gmail.com

8985893382

www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

బుధ వారం

11. 05. 2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-75

పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృధ్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak


## నానమ్మ, అమ్మమ్మల జ్ఞాపకార్థం
# పాఠశాలల నిర్మాణం



- సోయి లేకుండా కెసిఆర్‌పై విమర్శలు
- కెసిఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టాడు
- మానేరుతో మా అనుబంధం పెనవేసుకుంది
- పూర్వీకుల భూములన్నీ మునకకు గురయ్యాయి
- భూసేకరణలో భూములు కోల్పోయాం
- కోనాపూర్‌లో బడి నిర్మాణానికి కెటిఆర్ శంకుస్థాపన

**కామారెడ్డి, మే 10 (అక్షర వెలుగు):** తన నానమ్మ వెంకటమ్మ గ్రామమైన కోనాపూర్‌ను ఆదర్శంగా గ్రామంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కోనాపూర్ గ్రామానికి సీసీ రోడ్లు, వాటర్ ట్యాంక్, తాగునీటి కోసం 2 కిలోమీటర్ల పైపు లైన్, రెండు బస్ షెల్టర్లు, మినీ లైబ్రరీ, మినీ డెయిరీ, మహిళా మండలి భవనం, కొన్ని కుల సంఘాల భవనాలు, గ్రామపంచాయతీకి ప్రహరీ గోడ, పశువైద్య శాల, డబుల్ బెడ్రూం ఇండ్లతో పాటు దళితబంధు పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఈ అంశాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే మంజూరు చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. కోనాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. బీబీపేట్‌కు ఒక జూనియర్ కాలేజీని మంజూరు చేస్తామన్నారు. నానమ్మ జ్ఞాపకార్థంగా రూ. రెండున్నర కోట్లతో నిర్మించబోయే స్కూల్ భవనానికి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కొంత మంది రాజకీయ నాయకులు టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిని పట్టుకుని సోయి లేకుండా మాట్లాడుతున్నారు. కేసీఆర్ పుట్టిన నాడే వందల ఎకరాలు ఉన్న ఇంట్లో పుట్టిండు. ఆయనకు ఆస్తులు కొత్త కాదు. పొలం మధ్యలో ఇల్లు కట్టుకుంటే ఫామ్ హౌజ్ అని పేరు పెట్టి, అడ్డగోలు ప్రచారాలు చేస్తున్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన వ్యక్తి సీఎం కావడం వల్లే రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. రూ. 50 వేల కోట్లను రైతుబంధు రూపంలో 63 లక్షల మంది రైతులకు ఇచ్చారు. రైతు ఏ కారణంగా చనిపోయినా కూడా రైతు బీమా కింద రూ. 5 లక్షలు అందిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతం మొత్తం ఒకప్పుడు దుర్భిక్ష ప్రాంతం. ఇలాంటి ప్రాంతాలకు కాళేశ్వరం ద్వారా నీరందించి సస్యశ్యామలం చేశామని కేటీఆర్ తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో మానేరు మత్తడి దుంకుతుదని అనుకోలేదు. కానీ ఇవాళ అది ఆవిష్కృతమైందని కేటీఆర్ పేర్కొన్నారు. మానేరు ప్రాజెక్టుకు తమ కుటుంబానికి ఏదో అనుబంధం ఉందని మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. తమ పూర్వీకులు మానేరులో భూములు కోల్పోయారని అన్నారు. వారి జ్ఞాపకార్థం స్కూళ్లు నిర్మించాలని తలపెట్టానని అంటూ..ఈ అనుబంధం గురించి తెలియజేసేందుకు కేటీఆర్ తమ పూర్వీకుల కథ చెప్పుకొచ్చారు. నానమ్మ ఊరు అప్పర్ మానేరులో, అమ్మమ్మ ఊరు మిడ్ మానేరులో, ఇంకో అమ్మమ్మ(అమ్మ సోదరి) ఊరు కూడా లోయర్ మానేరులో మునిగిపోయిందని కేటీఆర్ గుర్తు చేశారు. నానమ్మ, అమ్మమ్మల జ్ఞాపకార్థంగా మన ఊరు- మన బడి ప్రోగ్రాం కింద తన సొంత ఖర్చులతో పాఠశాలలను నిర్మిస్తున్నట్లు కేటీఆర్ వెల్లడించారు.కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం కోనాపూర్‌లో నానమ్మ వెంకటమ్మ జ్ఞాపకర్థంగా నిర్మించే స్కూల్ బిల్డింగ్‌కు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. పలు ఆసక్తికర

2వ



## టీఎస్ఆర్టీసీలో
# వింత పరిస్థితి

- తగిన మైలేజీ రాలేదంటూ డ్రైవర్‌కు తాఖీదు
- జీతంలోంచి 10వేల కోత పెడతామంటూ నోటీస్

**హైదరాబాద్, మే 10 (అక్షర వెలుగు):** టీఎస్ఆర్టీసీలో వింత పరిస్థితి నెలకొంది. ఆదాయం తీసుకురాకపోతే కండక్టర్‌పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలా అని ప్రతి దగ్గర ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటే.. డ్రైవర్ కండక్టర్‌పై కస్సుమంటున్నాడు. ఇలా ఎక్కడపడితే అక్కడ ఆపుతూ పోతే డీజిల్ వ్యయం ఎక్కువవుతోందని.. దీంతో తాను డిపోలో చీవాట్లు తినాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు. ఆర్టీసీ బస్సు కేఎంపీఎల్ తగ్గితే.. అది డ్రైవర్ల జీతం నుంచి తీసుకోవాల్సి ఉంటుందని ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. ఎక్కువ కలెక్షన్ తీసుకురాకపోతే కండక్టర్‌పై అధికారులు మండిపడుతున్నారు. మరోవైపు ఎక్కడపడితే అక్కడ ఆపుతూ పోతే డీజిల్ వ్యయం ఎక్కువవుతోందని.. డిపోలో చీవాట్లు తినాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు. ట్రిప్పులు తగ్గినా.. సమయానికి బస్సులు రాకున్నా.. ఇంధనం ఎక్కువ

2వ

## మాజీమంత్రి
# నారాయణ అరెస్ట్

- ఎపికి తరలించిన సిఐడి పోలీసులు
- టెన్త్ లీకేజ్ వ్యవహారంలో అరెస్ట్ చేసినట్లు సమాచారం



**హైదరాబాద్, మే 10 (అక్షర వెలుగు):** మాజీ మంత్రి, నారాయణ విద్యాసంస్థల అధిపతి నారాయణను ఎపి సిఐడి పోలీసులు అరెస్ట్ చేశారు. కొండాపూర్‌లోని ఆయన నివాసంలో ఏపీ సీఐడీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఏపీలో టెన్త్ ప్రశ్నాపత్రాల లీకేజ్ వ్యవహారంలో ఆయనను పోలీసులు అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం. గత 4

2వ

# త్రోబాల్ ట్రోఫీకి పూర్తి సహకారం

క్రీడా, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**హైదరాబాద్, మే 10 (అక్షర వెలుగు):** హైదరాబాద్‌లో జరుగనున్న జాతీయ స్థాయి త్రోబాల్ చాంపియన్ షిప్ ట్రోఫీకి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని క్రీడా, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో 27వ జాతీయ త్రోబాల్ చాంపియన్ షిప్ వాల్ పోస్టర్, ట్రోఫీ, జెర్సీలను ఆవిష్కరించారు. జాతీయ త్రోబాల్ చాంపియన్ షిప్‌ను సికింద్రాబాద్‌లోని డీఏవీ పబ్లిక్ స్కూల్ సఫీల్ గూడలో మే 28 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నట్లు జాతీయ త్రోబాల్ అసోసియేషన్ నిర్వాహకులు మంత్రికి వివరించారు. ఈ చాంపియన్ షిప్‌లో 23 రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొంటున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, హ్యాండ్ బాల్ జాతీయ ఫెడరేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రావు, త్రోబాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నవీన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ గౌడ్, డీఏవీ స్కూల్ సౌత్ హెడ్ పార్తీబన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ నగరంలో అద్భుతంగా హెల్త్‌సిటీ




- 24 అంతస్తులతో 2వేల పడకల పెద్ద ఆసుపత్రి నిర్మాణం
- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి హరీష్ రావు
- కేంద్ర విధానాలతో పేదలకు భారంగా మారిందన్న మంత్రి

**వరంగల్, మే 10 (అక్షర వెలుగు):** కార్మికుల సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి హరీష్ రావు అన్నారు. వరంగల్‌లో అద్భుతంగా హెల్త్ సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. సంవత్సరంలోగా 24 అంతస్తులతో 2వేల పడకల పెద్ద ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కార్మిక మాసోత్సవాల సందర్భంగా హనుమకొండ మెగా హెల్త్ కాంప్‌ను మంత్రులు ప్రారంభించారు. మంగళవారం ఆయన వరంగల్ లో నిర్మిస్తున్న హెల్త్ సిటీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి.. బీజేపీది మాటల ప్రభుత్వమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పేదలు బతికే పరిస్థితి లేదన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కార్మికుల

2వ

## దేశానికి ఆదర్శంగా
# తెలంగాణ వ్యవసాయం

- మోడీ ప్రభుత్వానికి కానరాని చిత్తశుద్ధి
- దమ్మున్నంటే అమలు చేసి చూపాలి
- కాంగ్రెస్, బిజెపిలకు కడియం చురకలు



**వరంగల్, మే 10 (అక్షర వెలుగు):** తెలంగానలో అమలు చేస్తున్న పథకాలను దేశవ్యాప్తంగా అమలుచేసివుంటు ఇవాళ దేశం ఇంత దౌర్భాగ్య స్థితిలో ఉండేది కాదని, ఎమ్మెల్సీ, మాజీ డిప్యూటి సిఎం కడియం శ్రీహరి అన్నారు. వ్యవసాయరంగానికి ఇస్తున్న ఊతం దేశంలో ఎక్కడా లేదన్నారు. దేశంలో ఉన్ననీటిని, విద్యుత్‌ను సక్రమంగా వినియోగించుకోవాలన్న ఆలోచన మోడీ ప్రభుత్వానికి లేదన్నారు. వారికి దూరదృష్టి లేకపోవడం ప్రజలకు శాపంగా మారిందని మంగళవారం నాడిక్కడ అన్నారు. రైతుబంధు పథకాన్ని విమర్శిస్తున్న వారు రైతులను అవహేళన చేస్తున్నారని ఇతర రాష్ట్రాలలో పాలిస్తున్న కాంగ్రెస్, బిజెపిలు ఇలాంటి పథకాలను ఎందుకు అక్కడ ప్రవేశపెట్టడం లేదో తెలపాలని శ్రీహరి ప్రశ్నించారు. ఇక్కడ పర్యటనలకు వచ్చి విమర్శలు చేస్తున్న వారు రాష్ట్రంలోని రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసేందుకు ఏ దేశంలో, ఏ రాష్ట్రంలోని లేని విప్లవత్మాకమైన పథకాన్ని సీఎం

2వ

## కమాండ్ కంట్రోల్ సెంటర్
# పనులు కొలిక్కి

**హైదరాబాద్, మే 10 (అక్షర వెలుగు):** హైదరాబాద్ మహానగరంలో నిర్మిస్తున్న పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను మరో 3నెలల్లో ప్రారంభిస్తామని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. ఇప్పటి వరకు 95శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. స్టేట్‌లో లా అండ్ ఆర్డర్ కంట్రోల్ లో ఉండటంతో..రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. డీజీపీ మహేందర్ రెడ్డితో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను హోంమంత్రి మహమూద్ అలీ పరిశీలించారు. దేశంలో ఫస్ట్ టైమ్ మన రాష్ట్రంలోనే కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని సీసీ కెమెరాలన్నీ..కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే మానిటరింగ్ చేస్తామని తెలిపారు.

## కృష్ణా వాటా దక్కక
# పోవడానికి కెసిఆరే కారణం

- రంగారెడ్డికి చేరుకున్న బండి పాదయాత్ర



**రంగారెడ్డి, మే 10 (అక్షర వెలుగు):** కృష్ణా నది నీళ్లలో మనకు దక్కాల్సిన వాటా దక్కకపోవడానికి సీఎం కేసీఆర్ కారణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. 500లకు పైగా టీఎంసీలు నీళ్లు తెలంగాణకు రావాల్సి ఉండగా..కేవలం 299టీఎంసీలకు కేసీఆర్ ఎందుకు ఒప్పుకున్నారని ఆయన ప్రశ్నించారు. బండి సంజయ్ చేస్తున్న ప్రజా సంగ్రామయాత్ర మంగళవారం ఉదయం రంగారెడ్డి జిల్లాకు చేరుకుంది. షాద్ నగర్

2వ

# పేదలకు కానుకగా డబుల్ ఇళ్లు

- ఎక్కడా రూపాయిలంచం ఇవ్వకుండా ఇళ్ల అందచేత
- కోరుట్లపేటలో ఇళ్లను ప్రారంభించిన మంత్రి కెటిఆర్



**రాజన్నసిరిసిల్ల, మే 10 (అక్షర వెలుగు):** డబుల్ బెడ్రూం ఇండ్లు నిరుపేదలకు సీఎం కేసీఆర్ ఇస్తున్న కానుక అని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. 'కోరుట్లపేట గ్రామంలో డబుల్ బెడ్రూంలో గృహ ప్రవేశం చేసిన అన్నదమ్ములకు, అక్కా చెల్లెళ్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు. మూడు ఇండ్లలో లాంఛనంగా వారికి

2వ

## సాగర్‌హైవేపై
# ఘోరరోడ్డు ప్రమాదం

బైకును కారు ఢీకొనడంతో తండ్రీకొడుకుల దుర్మరణం

**రంగారెడ్డి, మే 10 (అక్షర వెలుగు):** జిల్లాలో ఘోర రోడ్డ ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్- నాగార్జునసాగర్ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృత్యువాతపడ్డారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన ముచ్చర్ల రాములు (35), కుమారుడు సోను (11)తో కలిసి మోటర్ సైకిల్‌పై మాల్‌లోని సంతలో సరుకుల కొనుగోలు కోసం వెళ్తున్నారు. తమ్మలోనిగూడ గేటు వద్ద మాల్ నుంచి ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులు అక్కడికక్కడే

2వ

## సంపాదకీయం

# రావణకాష్టంలా శ్రీలంక సంక్షోభం !

శ్రీలంకలో ప్రస్తుత సంక్షోభం ఇవ్వాళ ఒక్కరోజులో వచ్చింది కాదు. ప్రజలకు తాయిలాలు పంచి ఆర్థిక రంగాన్ని దివాళా తీసే పథకాలతో పాలకులు చేసిన పాపాలకు ఇవాళ ఫలితం అనుభవించాల్సి వస్తోంది. ప్రజలు తాయిలాలు తీసుకునే వరకు తీసుకుంటారు. పరిస్థితి శృతిమించితే తాటతీస్తారనడానికి తాజ పరిణామాలే ఉదాహరణ. చివరకు ప్రధాని రాజపక్స రాజీనామా చేశారు. పాలనచేయలేక చేతులెత్తేశారు. ఆర్థిక మంత్రిత్వ శాఖను తీసుకుని నడపాలని పిలిచినా ఎవరూ రాని దుస్థితి ఏర్పడింది. చివరకు ప్రధాని రాజపక్స రాజీనామా చేయక తప్పింది కాదు. అయినా ఈ సంక్షోభం రాజీనామాలతో సమిసి పోదు. రంకెలు వేస్తూ పరుగెడుతున్న జవానాశ్వాన్ని ఒడిసి పట్టి అదుపులోకి తెచ్చే సమర్థనేత కావాలి. అది ఇప్పుడున్న నాయకత్వానికి సాధ్యం కాకపోవచ్చు. అందుకే కోపోద్రిక్తులైన ప్రజల దాడిలో ఓ ఎంపి మరణించాడు. దాడుల నేపథ్యంలో సైన్యం రంగంలోకి దిగింది. కర్ఫ్యూ విధించారు. ఇదంతా కూడా పాలకుల చేతగాని తనంగా మారిన దానికి పరాకాష్ఠగా చూడాలి. ప్రజల ఓట్ల కోసం పథకాల పేరుతో డబ్బు పందేరం చేస్తే ఏమవుతుం దనడానికిది నిదర్శనంగా చూడాలి. పాలకుల దూరదృష్టి లోపం, ఒక్కసారి అధికారంలోకి వస్తే మళ్లీ ఆ అధికారన్ని నిలుపుకునేందుకు ఇబ్బడిముబ్బడిగా ఉచిత పథకాలను ప్రవేశ పెట్టడం దారుణం కాక మరోటి కాదు. ఇది ప్రపంచ దేశాలన్నింటికి కనువిప్పు కావాలి. ముఖ్యంగా భారత పాలకులకు, ప్రజలకు కూడా కనువిప్పు కావాలి. దేశానికి ఇంత అన్యాయం చేసి కూడా ఇంకా అధికారాన్ని పట్టుకొని వేలాడుతు న్నారని రాజపక్సలమీద ప్రజలు మండిపడుతున్నారు. దేశాధ్యక్షుడినుంచి సాధారణ మంత్రి వరకూ అన్నీ తామై వారే ఏలుతున్నందున కుటుంబపాలనను విమర్శించ దల్చుకున్నవారికి లంక కుటుంబపాలన ఇప్పుడు నిలువెత్తు నిదర్శనమైంది. కుటుంబ పాలనంటే అసమర్థపాలనే అని తీర్మానించ డానికి లంక సంక్షోభాన్ని ఉదహరిస్తున్నారు. ప్రభుత్వం మైనారిటీలో ఉన్నా అధ్యక్ష, ప్రధానులు కుర్చీ దిగనందుకు విపక్షాలు వారిపై రాజకీయ ఒత్తిడి పెంచాయి. చివరకు ప్రధాని రాజీనామా చేయక తప్పలేదు. ఎంపిని కూడా చంపారంటే ఎంతగా సంక్షోభం ముదిరిందో అర్థం చేసుకోవచ్చు. ఆహారం, చమురు, మందులు, విద్యుత్తు ఇలా ప్రతీ విషయంలోనూ రోజూ వెతుక్కోవాల్సిన దుస్థితిలో పడినప్పుడు ప్రజలను మాయ చేయడం కుదరదు. భారత్ కొద్దోగొప్పో ఆదుకున్నా పరిస్థితి దారికి రాలేదు. మహీంద రాజపక్సే అధ్యక్షుడి గా ఉన్నప్పుడు చైనాతో చేయిచేయి కలిపి దేశాన్ని దాదాపుగా తాకట్టుపెట్టేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు కష్టకాలంలో చైనా ఎక్కువగా ఆదుకోకపోవడం విశేషం. తమకష్టాలకు చైనా కారణమని ఎక్కువ మంది ప్రజల్లో వ్యతిరేకత ఉన్నందున సాయం విషయంలో చైనా చేతులు దులిపేసుకుందని అంటారు. ఇటీవల భారతదేశం ఆర్థిక సాయంతోపాటు ఆహారాన్ని కూడా భారీగా అందించి లంకను ఆదుకుంది. ఆ తరువాత కూడా భారతదేశం నుంచి ఏదో రూపంలో సహాయం అందుతూనే ఉన్నది. ప్రస్తుత దుస్థితి ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చినదేమీ కాదు. కానీ, ఆదాయం కంటే వ్యయం అధికంగా ఉండటం, అందుకోసం అందినమేరకు అప్పులు చేయడం, ఉత్పత్తి విషయంలో శ్రద్ధపెట్టకపోవడం, ఎగుమతికీ, వాణిజ్యానికీ ఉపకరించే మరిన్ని వస్తుసేవలపట్ల ఒక నిర్దిష్టమైన ఆలోచనావిధానం లేకపోవడం వంటి కారణాలు అనేకం తోసుకుని రావడంతో ఈ ఆర్థిక సంక్షోభం దాపురించింది. పర్యాటకంమీద ఆధారపడిన దేశం కావడంతో ఈ మహమ్మారి దానిని బాగా దెబ్బకొట్టింది. తేయాకు, బట్టలు ఇత్యాది ఎగుమతులు దెబ్బతిన్నాయి. ఇక అన్నింటికి మించి ప్రభుత్వం నయా ఉదారవాద విధానంతో ఊబిలోకి పడింది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రతీ దేశాన్నీ నయా ఉదారవాద ఉచ్చులోకి లాగుతోందనడానికి ఇది ప్రబల ఉదాహరణ. శ్రీలంకలో బద్దలైన ఆర్థిక సంక్షోభం గురించి ఇప్పటికిప్పుడు చేసేదేమీ లేదు. విషయం ముందే తెలిసినా పాలకులు పట్టించుకోలేదు. విదేశీ రుణం భారీగా పేరుకుపోవడం, వ్యాట్‌లో హెచ్చు మోతాదులో ఇచ్చిన రాయితీల ఫలితంగా ప్రభుత్వ ఆదాయం పడిపోయి ద్రవ్యలోటు పెరిగిపోవడం జరిగింది. విదేశీ రుణం తీసుకోవడం అన్నది బాగా కొంపముంచింది. శ్రీలంక పరిస్థితి ఇలా తారుమారవ డానికి బాధ్యత ఎవరిదన్న ప్రశ్నకు సమాధానం ఎలా ఉన్నా...పాలకలు దృష్టి లోపం అన్నది ఖచ్చితంగా చెప్పుకోవాలి. ఈ పతనానికి రాజపక్స ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందే.చైనా దేశంతో ఆర్థిక సంబంధా లు బలంగా పెంచుకుంటు న్నందు వల్లనే శ్రీలంకకు ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు కూడా దుయ్యబడు తున్నారు. శ్రీలంక విదేశీ రుణం భారీగా పెరిగి పోతున్నా నిమ్మకు నీరెత్తినట్టు అక్కడి ప్రభుత్వం బాధ్యతా రహితంగా వ్యవహరించ డం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది. మన దేశంలోని కొన్ని రాష్ట్రాలు కూడా శ్రీలంక ప్రభుత్వం బాటలోనే నడుస్తున్నాయని, పద్ధతులను మార్చుకోకపోతే ఆ రాష్ట్రాల్లో కూడా పరిస్థితులు అదుపు తప్పిపోతాయని హెచ్చరిస్తున్నారు. కొనుగోలుశక్తి పడిపోవడం, ఉత్పత్తి మందగించడం, నిరుద్యోగం వంటివి తోడుకావడం తో ఆర్థికరంగం కరిమింగిన వెలగపండులా మారింది. సంక్షోభం ముంచు కొస్తోందని కొంతమంది ముందు గానే హెచ్చరించినా ప్రభుత్వం జాగ్రత్తపడలేదు. సంక్షేమ పథకాలను కుదించుకోలేదు. ప్రభుత్వ వ్యయంలో కోతలు పెట్టడం, దాని పర్యవసానంగా ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, దానికి తోడు ఆర్థిక మాంద్యం ఏర్పడే వాతావరణం నెలకొనడం అన్నవి చకచకా సాగి పోయాయి. ఈ క్రమంలో విదేశీ రుణాలను విరివిగా తీసుకోవలసిరావడం..దానివల్ల విధింధించే షరతులు అంతకంతకూ విషమంగా తయారయ్యాయి. ఈ కారణంగా శ్రీలంక కొద్ది కాలంలోనే ఆ దేశం ఆర్థిక సంక్షోభాన్ని చవి చూడవలసిన పరిస్థితి ఏర్పడింది. అలాగే పాలనా నిర్వహణలో జరిగిన లోపాలూ చాలా ఉన్నాయి. అందుకే ఈ ఫలితాలను వ్యతిరేకిస్తూ ఇప్పుడు అక్కడి ప్రజానీకం పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చి నిరసనలకు దిగాల్సివచ్చింది. శ్రీలంక సంక్షోభం అనుభవాల నుండి పాఠాలు నేర్చుకోవాలి. అదే పనిగా సంక్షేమ విధానాలను అమలు చేయడం, ప్రబుత్వ ఖజానాను దోచిపెట్టేలా చేయడం వల్ల ఆర్థికి సంక్షోభంలో కూరుకుపోడం ఖాయంగా గుర్తించాలి. ఇటువంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే సంక్షేమ పథకాల మీద వ్యయాన్ని తగ్గించుకోవాల్సిందే. ప్రభుత్వ వ్యయాన్ని కుదించడం వంటి చర్యలు అనివార్యంగా చేపట్టాలి. అయితే ఇవన్నీచేయగల సమర్థుడు శ్రీలంకకు అవసరం. లేకుంటే రావణకాష్టం తప్పదు.

**పృథ్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

# దేశద్రోహ చట్టం కేసులు నిలిపి వేయండి

- తుది నిర్ణయం తీసుకునే వరకు చట్టప్రయోగం ఆపండి
- సెక్షన్ 124ఏ కింద కేసులు నమోదు కాకుండా రాష్ట్రాలను ఆదేశించండి
- కేంద్ర అఫిడవిట్‌పై విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం సూచన

**న్యూఢిల్లీ, మే 10 (అక్షర వెలుగు):** దేశద్రోహ చట్టాన్ని పునఃపరిశీలిస్తామని కేంద్రం సోమవారం స్పష్టం చేసిన నేపథ్యంలో...దేశద్రోహం కేసులను తాత్కాలికంగా ఎందుకు నిలిపివేయకూడదో వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. సెక్షన్ 124ఏ ప్రకారం కేసులు నమోదు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించింది. ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజెఐ జస్టిస్ ఎన్‌వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది.. అప్పటివరకు కేసులు నిలిపివేత సాధ్యాసాధ్యాలపై ఆరా తీసింది. కేంద్రం తుది నిర్ణయం తీసుకునేలోపు పౌరుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని.. దేశద్రోహం చట్టం ప్రకారం చర్యలు తీసుకోకుండా చూడాలని పేర్కొంది. అదేసమయంలో, దేశద్రోహం చట్టంపై పునఃపరిశీలన ప్రక్రియను 3-4 నెలల్లోగా పూర్తి చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. దేశద్రోహం చట్టం కింద నమోదైన పెండింగ్ కేసులపై కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా ముందుకెళ్లాలని యోచిస్తోందనే విషయాన్ని వివరించాలని కోరింది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి బుధవారం స్పందన సమర్పించనున్నట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. కేంద్రం తరపున విచారణకు హాజరైన ఆయన.. కేసుల నమోదు తాత్కాలికంగా నిలిపివేయడంపై చర్చిస్తామని చెప్పారు. అనంతరం విచారణ బుధవారానికి వాయిదా పడింది. రాజద్రోహం చట్టంపై పునరాలోచన చేస్తామని సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్రం సోమవారం తెలియజేసింది. అంతకుముందు అఫిడవిట్‌లో చట్టాన్ని సమర్థించిన కేంద్రం.. అనూహ్యంగా యూటర్న్ తీసుకుంది. ఈ కేసులపై సుప్రీంకోర్టు విచారణ చేపడుతున్న నేపథ్యంలో.. కేంద్రం తన స్పందన తెలియజేసింది. పునఃపరిశీలన పక్రియ ముగిసేవరకు వ్యాజ్యాలపై విచారణ చేపట్టవద్దని అఫిడవిట్‌లో పేర్కొంది. 'వలసపాలకుల నాటి రాజద్రోహం చట్టం చెల్లుబాటును ప్రశ్నిస్తూ దాఖలైన వ్యాజ్యాలను విస్తృత ధర్మాసనానికి నివేదించాలా? లేదా?' అన్న అంశంపై ఈ నెల 10న వాదనలు వింటామని ఇటీవల వెల్లడించింది. దీనిపై గతవారం విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం.. ఈ అంశంపై తన స్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం అఫిడవిట్లు దాఖలు చేసింది. దీనిపై సుప్రీంకోర్టు మంగళవారం నిర్ణయం తీసుకోనుంది. భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 124ఏ యథేచ్ఛగా దుర్వినియోగమవుతోందని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతున్న తరుణంలో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి 24 గంటల గడువు ఇచ్చింది. ఈ వివాదాస్పద సెక్షన్‌ను సమీక్షించాలని ప్రభుత్వం ప్రతిపాదించడంతో, ఈ పక్రియ పూర్తయ్యే వరకు ప్రస్తుతం నమోదైన రాజద్రోహం కేసులపై తదుపరి చర్యలను తాత్కాలికంగా నిలిపేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేయాలని భావిస్తోందా లేదా తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఆదేశించింది. బుధవారం నాటికి తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాజద్రోహం చట్టాన్ని పునఃపరిశీలించేంత వరకు విచారణను వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. చట్టాన్ని పునఃపరిశీలించేందుకు ఎంత కాలం పడుతుందని, దీని దుర్వినియోగాన్ని ప్రభుత్వం ఏ విధంగా పరిష్కరిస్తుందని కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. హనుమాన్ చాలీసాను పఠించడం కూడా ఇటువంటి కేసులకు దారి తీస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ అఫిడవిట్‌లో పేర్కొన్న విషయాన్ని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. ఈ చట్టం దుర్వినియోగ మవుతోందని అఫిడవిట్లోనే చెప్తున్నారని పేర్కొంది. దీనిని ఎలా ఎదుర్కొంటారని ప్రశ్నించింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణం రాజు, మహారాష్ట్రలోని అమరావతి ఎంపీ నవనీత్ రాణా, ఆమె భర్త రవి రాణా వంటివారిపై ఈ సెక్షన్ ప్రకారం రాజద్రోహం కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఇదే సెక్షన్ ప్రకారం హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన పాత్రికేయుడు వినోద్ దువాపై నమోదైన కేసును సుప్రీంకోర్టు రద్దు చేసింది.

## కృష్ణా వాటా దక్కక పోవడానికి కెసిఆరే కారణం

(మొదటి పేజి తరువాయి) నియోజకవర్గం తొమ్మిది రేకుల గ్రామం దగ్గర బండి సంజయ్ కు ..పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తర్వాత గ్రామంలోని ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

## వరంగల్ నగరంలో అద్భుతంగా హెల్త్‌సిటీ

(మొదటి పేజీ తరువాయి) సంక్షేమం కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకోవడం అభినందనీయమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. కనీసం కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. ఉజ్వల్ పథకం కింద సిలిండర్లు ఇచ్చామని ప్రచారమే తప్ప ఇచ్చింది లేదన్నారు. గ్యాస్ ధరలు పెంచిన కారణంగా పేదలు తిరిగి పొయ్యిల కట్టెలను కొంటున్నారని తెలిపారు. కార్మికులకు ఉచిత బీమా చేసింది తెలంగాణ ప్రభుత్వం మాత్రమే అని స్పష్టం చేశారు. ఆటోలకు లైఫ్ టాక్స్ మాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాలు ఏనాడూ కార్మికులను పట్టించుకోలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు లక్ష మోటార్ సైకిల్స్ ఇవ్వాలని సీఎం నిర్ణయించారని పేర్కొన్నారు. వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏడాదిలోగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రభుత్వ విప్ వినయ్ భాస్కర్‌పై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రశంసల వర్షం కురిపించారు. నిత్యం కార్మికుల మధ్య ఉంటూ శ్రమజీవిలా కష్టపడే నాయకుడు వినయ్ భాస్కర్ అని కొనియాడారు. కార్మిక చైతన్య మాసోత్సవం సందర్భంగా హనుమకొండ టీటీడీ కల్యాణ మండపం ప్రాంగణంలో వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌ను మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు కలిసి ప్రారంభించారు. అంతకుముందు వరంగల్ జిల్లా పర్యటనలో ఉన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఉదయం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హరీశ్‌రావును అర్చకులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు, ఈవో పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. హరీశ్‌రావు వెంట మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రభుత్వ విప్ వినయ్ భాస్కర్, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపనేని నరేందర్, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

# టీఎస్ఆర్టీసీలో వింత పరిస్థితి

(మొదటి పేజీ తరువాయి) వ్యయం అయినా.. డ్రైవర్‌పై డిపో మేనేజర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆఖరుకు లీటరు డీజిల్‌కు తిరగాల్సిన కిలోమీటర్లు తగ్గాయని ఓ డ్రైవర్‌కు నెల మొత్తం లెక్కలు కట్టి.. రూ.10 వేలు నీ జీతంలో ఎందుకు కోత విధించరాదో వివరణ కోరుతూ డిపో మేనేజర్ ఏకంగా తాఖీదు ఇచ్చారు. ఈ పరిణామాలు ఆర్టీసీలో చర్చనీయాంశమయ్యాయి. మిధాని డిపోకు చెందిన సూపర్‌లగ్జరీ బస్సును డ్రైవర్ ఏప్రిల్‌లో 4400 కిలోమీటర్లు నడిపారు. 948 లీటర్ల డీజిల్ ఖర్చు చేశారు. ఒక లీటర్ డీజిల్‌కు 4.64 కిలోమీటర్లే మాత్రమే వచ్చింది. 5.20 కిలోమీటర్లు రావాల్సి ఉండగా.. మీరు ఎక్కువ ఇంధన వ్యయం జరిగేలా చేయడంతో 102 లీటర్లు అదనంగా కొనాల్సి వచ్చింది. దీంతో రూ.10,710ల నష్టం వచ్చింది. ఇప్పటికే రూ.3 కోట్ల నష్టంలో ఉన్న డిపో ఈ అదనపు భారం ఎలా మోయగలదు. ఈ నష్టాన్ని మీ జీతం నుంచి ఎందుకు వసూలు చేయకూడదో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ డిపో మేనేజర్ తాఖీదు జారీ చేశారు. దూర ప్రాంతాలకు నడిచే బస్సుల ఇంధన వ్యయంపైనే కాదు.. నగరంలో తిరుగుతున్న బస్సుల ఇంధనవ్యయాన్ని వారానికోసారి మదింపు చేసి.. ఎందుకు ఇంత ఖర్చు చేయాల్సి వస్తుందో వివరణ కోరడం పరిపాటిగా మారింది. ఎక్కువ కేఎంపీఎల్ వచ్చేలా చూసే డిపో మేనేజర్లు చివరికి వారి జీతాల్లో కోతకు కూడా వెనుకాడడంలేదు. ఇదే ఇప్పుడు డ్రైవర్ల నిరసనకు కారణమవుతోంది. ఇంధన పొదుపుపై ఆర్టీసీ డ్రైవర్ల మీద ఒత్తిడి పెరిగింది. రోజూ డ్రైవర్లు లక్ష్యంగా మారుతున్నారు. వరుసగా వారం రోజులు చూసి.. వారికి విధులు అప్పగించకుండా డిపోలకు పిలిపించుకుని ఉదయం నుంచి అలా వేచి చూసేలా చేసి.. క్లాసులు తీసుకుంటున్నారని.. పలువురు డ్రైవర్లు వాపోతున్నారు.ఆర్డినరీ బస్సులు లీటరు డీజిల్‌కు 5.8 కిలోమీటర్లు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు అయితే 4.50 కిలోమీటర్లు నడవాలని టీఎస్ఆర్టీసీ అధికారులు నిర్దేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకపోతే కొంతవరకూ డ్రైవర్లు లక్ష్యం మేరకు నడుపుతున్నారు. ట్రాఫిక్ జామ్‌లుంటే ఎలా అని డ్రైవర్లు వాపోతున్నారు.

# పేదలకు కానుకగా డబుల్ ఇళ్లు



(మొదటి పేజీ తరువాయి) అందజేసి, గృహ ప్రవేశం చేయించాం అని అన్నారు. లాంఛనంగా గృహప్రవేశం చేయించే సందర్భంగా ముగ్గురిని ఒకటే అడిగిన. మీరు ఎక్కడ ఉండేది అని అడిగిన?. ఇక్కడే గుడిసెలో ఉండేవాళ్లమని చెప్పారు. మరి ఇదే ఇల్లుగనక మీరు కట్టి ఉంటే ఎంత ఖర్చయ్యేదని అడిగిన.. రూ.8లక్షల నుంచి రూ.10లక్షలు ఖర్చవుతుండే, కానీ ప్రభుత్వమే మాకు నిర్మించి ఇచ్చిందని చెప్పారు. ఒక్క రూపాయి గానీ, ఒక పైసా గానీ ఎవరికైనా లంచం ఇచ్చారా?.. మీ సర్పంచో.. ఉప సర్పంచో.. వార్డు మెంబరో.. ఎంపీటీసీ ఎవరికైనా పైసా లంచం ఇవ్వాల్సి వచ్చిందా? అని అడిగిన. ఒక్క పైసా లంచం ఇవ్వాల్సిన అవసరం పడలేదన్నారు. మమ్మల్ని వెతికి.. ఇల్లు లేదని గుర్తించి.. అర్హత ఉందని భావించి డబుల్ బెడ్రూం ఇచ్చారు.. సంతోషం అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా కేవలం రూ.20వేలకోట్లతో ప్రభుత్వం బ్రహ్మాండంగా 2.70లక్షల ఇండ్లు నాణ్యంగా నిర్మించి పేదలకు అందజేస్తున్నది. ఇలాంటి కార్యక్రమం భారతదేశంలోని ఏ రాష్ట్రంలో లేదు. కేవలం తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో మాత్రమే ఉన్నది. కావాలంటే దేశంలో ఎక్కడైనా చూడొచ్చు. ఏ రాష్ట్రమైనా పోవచ్చు.. అక్కడ మీకు చుట్టాలున్నా.. అక్కడ మీకు దోస్తులున్నా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. రెండు బెడ్రూంలు, రెండు టాయిలెట్లు, ఒక హాలు, ఒక కిచెన్.. భారతదేశంలో ఇంత నాణ్యత ఇండ్లు కడుతున్న ప్రభుత్వం ఎక్కడా లేదన్నారు. 500 చదరపు అడుగుల్లో ఇంత బ్రహ్మాండంగా పేదవారికి రూపాయి కట్టాల్సిన అవసరం లేకుండా ఇస్తున్న ప్రభుత్వం భారతదేశంలో ఎక్కడా లేదు. మేం ఏం కోరుతున్నమంటే.. ఇంత నాణ్యమైన ఇండ్లను చేతిలో పెట్టినప్పుడు.. చుట్టుపక్కల పరిశుభ్రత పాటించండి. మొక్కలు నాటండి. ఆరోగ్యకరమైన వాతావరణంలో ఇండ్లను కాపాడుకోవాలని చెబుతున్నాం. ఈ ఇండ్లు మీకు కేసీఆర్ ఇస్తున్న కానుక. దీన్ని మీరు పిల్లలకు ఇచ్చుకునే విధంగా బ్రహ్మాండంగా మేయింటెన్ చేయాలని కోరుతున్నాం. గ్రామాల్లో జరుగుతున్న కార్యక్రమాలు తెలుసు. పల్లె ప్రగతిలో బ్రహ్మాండమైన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎక్కడ చూసినా చెట్లు, మిషన్ భగీరథలో భాగంగా మంచినీళ్లు, మంచినీళ్ల ట్యాంకులు, రైతులు వేదికలు, వైకుంఠధామాలు, నర్సరీలు ఇవన్నీ దేశంలో ఒక తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు అని వివరించారు. 24 గంటల కరెంటు వస్తున్నది, రైతుబంధు ద్వారా 50వేలకోట్ల రూపాయాల రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది.రైతుబీమా ద్వారా రైతు కుటుంబానికి ఏమైనా అయితే రూ.5లక్షలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అన్నారు భారతదేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా లేని ఎన్నో కార్యక్రమాలు మన కోసం చేస్తున్న కార్యక్రమాలు. దయచేసి నేను కోరుకునేది మంచి కార్యక్రమాల్ని వాడుకోండి.. వినియోగించుకోండి. కొత్త పెన్షన్లు త్వరలోనే వస్తాయ్.. ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే. ఇచ్చిన ఆస్తిని సద్వినియోగం చేసుకోవాలని అంటూ కేటీఆర్ సూచించారు. ఈ సందర్భంగా మోహన్ అనే వ్యక్తి మృతి చెందగా.. సెస్ తరపున మంజూరైన రూ.5లక్షల బీమా చెక్కును మృతుడి భార్య పద్మకు మంత్రి అందజేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించారు. పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలో ఎస్‌డీఎఫ్, ఈజీఎస్ నిధులు రూ.33లక్షలతో నిర్మించిన గ్రామీణ ప్రగతి ప్రాంగణం, రూ.22లక్షల నిర్మించిన రైతువేదిక, సీడీఎఫ్ నిధులు రూ.15లక్షలతో నిర్మించిన రెడ్డి సంఘ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. రూ.5లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ వ్యవసాయం

(మొదటి పేజి తరువాయి) కేసీఆర్ ప్రారంభించారని గుర్తించాలని కడియం అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతుబంధు పథకాన్ని దమ్ముంటే కాంగ్రెస్,బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రారంభించాలన్నారు. రైతులపై ప్రేమ ఒలకబోస్తున్నవారు చేసి చూపాలన్నారు. గత పాలకుల హయాంలో వ్యవసాయం దండుగ అన్న రైతులు నేడు వ్యవసాయం పండుగ అనేలా చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రతిఒక్క రైతు రుణపడి ఉంటారని అన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి, ఒక ఎకరానికి కూడా నీరు ఇవ్వకుండా లక్ష కోట్లు ఖర్చుపెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దే అని విమర్శించారు. రాష్ట్రంలో ని అన్ని వర్గాలకు అన్నిరకాల పథకాలు అమలు చేస్తున్న ఏకైక సిఎం కేసిఆర్ అన్నారు. పేదింట్లో ఆడపిల్ల పుట్టిందంటే, ఆ పిల్ల పెళ్లీడుకు వచ్చిదంటే తల్లిదండ్రులకు భయం. ఆ పిల్ల పెళ్లి చేయడానికి వారు పడే అవస్థలు స్వయంగా చూసిన వ్యక్తిని తానేనని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. పేదింటి కష్టాలు తెలిసిన వ్యక్తి సిఎం కేసిఆర్ ఆడపిల్ల పెళ్లికి మేనమామలాగా మొదట్లో 51వేలు, తర్వాత సరిపోదని 75వేలు, ఇప్పుడు ఇంకా పెంచి లక్షా 116 రూపాయలు ఇస్తున్న గొప్ప సిఎం అని కొనియాడారు. అదేవిధంగా పేదింట్లో గర్భిణీ అయిన తర్వాత కూడా ప్రసవం వరకు పనిచేయకపోతే గడవని పరిస్థితిని గమనించిన సిఎం కేసిఆర్ గర్భిణీ స్త్రీలకు గర్భం దాల్చిన మూడు నెలలు, ప్రసవం తర్వాత మరో మూడు నెలల పాటు నెలకు 2వేల రూపాయల చొప్పున 12వేల రూపాయలు, ఆడపిల్ల పుడితే ప్రత్యేకంగా మరో వెయ్యి రూపాయలు కలిపి 13వేల రూపాయలు ఇస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా జాన్సన్ అండ్ జాన్సన్ వంటి గొప్ప కంపెనీ తయారు చేసిన 15 రకాల ఉత్పత్తులతో కేసిఆర్ కిట్ ఇస్తున్నారని చెప్పారు. ప్రసవం ముందు, తర్వాత డబ్బులు ఇస్తూ, పిల్లలకు, తల్లికి వస్త్రాలు, కేసిఆర్ కిట్ ఇచ్చి అమ్మ ఒడి వాహనంలో ఇంటి దగ్గర దించుతున్న ఏకైక ప్రభుత్వం దేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒకటేనని తెలిపారు. సంక్షేమ పథకాల్లో తెలంగాణ ప్రభుత్వం దేశంలో నెంబర్ వన్ స్థానంలో ఉందని శ్రీహరి అన్నారు. 42 లక్షల మందికి ఆసరా పెన్షన్లను ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రతి రైతుకు ప్రభుత్వమే పంట పెట్టుబడి సాయం అందించడం దేశ రైతాంగ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని అన్నారు. ఈ విషయంలో యావత్ దేశానికి తెలంగాణ దిక్సూచిగా నిలిచిందని చెప్పారు. వ్యవసాయం బాగుంటేనే దేశం బాగుంటుందని గుర్తించే ఈ పథకం ప్రవేశ పెట్టారని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ పూర్తయితే కోటి ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. వ్యవసాయం బాగుండాలంటే భూములు, నీళ్లు, కరంటు ఉండాలని చెప్తూ.. ఇప్పటికే రికార్డుల ప్రక్షాళన పూర్తయిందని, వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, దీనికితోడు నుంచి పంట పెట్టుబడి కూడా అందిస్తున్నామని చెప్పారు.

# మాజీమంత్రి నారాయణ అరెస్ట్

(మొదటి పేజి తరువాయి) రోజులుగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి నారాయణ అజ్ఞాతంలో ఉన్నారు. ఇదిలా ఉంటే, చిత్తూరు జిల్లాలో నారాయణ స్కూల్ నుంచి టెన్త్ పేపర్లు లీకైన సంగతి తెలిసిందే. ఇదే కేసులో ఇప్పటికే వైస్ ప్రిన్సిపల్ గిరిధర్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. మంగళవారం ఉదయం ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చిన సీఐడీ అధికారులు కొండాపూర్‌లోని నివాసంలో నారాయణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని విశ్వసనీయవర్గాల సమాచారం. నారాయణను ఆయన సొంతకారులోనే ఏపీకి తరలించినట్లు సమాచారం. నారాయణ వెంట ఆయన సతీమణి కూడా ఉన్నారు. మరోవైపు టోల్‌గేట్ దగ్గరికి పెద్ద ఎత్తున నారాయణ విద్యాసంస్థల సిబ్బంది చేరుకున్నారు. ఏపీలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమై నప్పట్నుంచీ లీకుల బెడద ఎక్కువైన సంగతి తెలిసిందే. అయితే ఈ లీకేజీ వ్యవహారంలో నారాయణ విద్యాసంస్థల పాత్ర కూడా ఉందని గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున ఆరోపణలు, వార్తలు వస్తున్నాయి. ఆయన నారాయణ విద్యాసంస్థల చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలోనే నారాయణను అదుపులోకి తీసుకున్నారని వార్తలు గుప్పుమంటున్నాయి. మరోవైపు.. రాజధాని అసైన్డ్ భూముల కేసులో విషయంలోనూ గతంలో నారాయణకు సీఐడీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో నెల్లూరులోని నారాయణ నివాసంలోనూ సీఐడీ సోదాలు చేసింది. అయితే ఇప్పుడు ఆయన్ను ఎందుకు, ఏ విషయంలో అదుపులోకి తీసుకున్నారు..? సీఐడీ అధికారులు ఎందుకు ఏపీ నుంచి హైదరాబాద్‌కు రావాల్సి వచ్చింది..?

## సాగర్‌హైవేపై ఘోరరోడ్డు ప్రమాదం

(మొదటి పేజి తరువాయి) దుర్మరణం చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాములు పెయింటింగ్ పని చేస్తూ జీవిస్తున్నాడు. రాములుతోపాటు కుమారుడు కూడా మృతి చెందడంతో స్వగ్రామం మేడిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నానమ్మ, అమ్మమ్మల జ్ఞాపకార్థం పాఠశాలల నిర్మాణం



(మొదటి పేజీ తరువాయి) విషయాలను కేటీఆర్ సభా వేదికగా వెల్లడించారు. పోసన్ పల్లి గురించి నానమ్మ చెప్తుంటే విన్నదే తప్ప చూసింది లేదని కేటీఆర్ పేర్కొన్నారు. గతంలో పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్నప్పుడు బీబీపేట్ వచ్చి ఇక్కడికి రాలేకపోయాను. బీబీపేట్‌లో సుభాష్ రెడ్డి పాఠశాల కట్టించినప్పుడు తాను కూడా పోసాన్ పల్లిలో నానమ్మ జ్ఞాపకార్థం బడి కట్టిస్తానని హామీ ఇచ్చాను. అందులో భాగంగా మన ఊరు- మన బడి కార్యక్రమం కింద నానమ్మ, అమ్మమ్మ ఊరిలో బడులు కట్టిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. రూ. రెండున్నర కోట్లతో నానమ్మ పేరు మీదు బడిని కడుతున్నాను. నానమ్మ ఆత్మ శాంతించాలని, ఈ ఊరికి సొంతంగా మేలు చేసిన వాళ్లం కావాలని ఈ నిర్ణయం తీసుకున్నానని కేటీఆర్ తెలిపారు. ఊరితో ఉండే అనుబంధాన్ని కేటీఆర్ పంచుకున్నారు. 80 ఏండ్లటి కింది కథ. నానమ్మది పోసాన్ పల్లి, తాతది సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని మోహినికుంట గ్రామం. అయితే నాయినమ్మ వాళ్లకు మగపిల్లలు లేరు. పెళ్లి చేసేటప్పుడే అల్లుడిని ఇల్లరికం అడిగారు. రాఘవరావు గారు ఇక్కడికే వచ్చారు. వ్యవసాయం చేసి ఇక్కడే స్థిరపడ్డారు. అప్పర్ మానేరు ప్రాజెక్టు అప్పటికీ కాలేదు. దాదాపు 45వ సంవత్సరం దాకా అంటే అప్పర్ మానేరు ప్రాజెక్టు కట్టేదాకా ఇక్కడే ఉన్నారు. నలుగురు అయిదుగురు పిల్లలను ఇక్కడే కన్నారు. ఈ చెరువు విస్తరించి మానేరు వాగు మీద అప్పర్ మానేరు డ్యాం కట్టాలని నిజాం నిర్ణయం తీసుకున్నప్పుడు, చెరువు విస్తరణలో వందల ఎకరాలు పోయాయి. 1940వ దశకంలో భూములను కోల్పోయారు. ఆనాటి రోజుల్లోనే భూమి కోల్పోయినందుకు రెండున్నర లక్షలు ఇచ్చింది. ఇప్పుడు ఆ విలువ కోట్ల రూపాయాల్లో ఉంటుందని కేటీఆర్ తెలిపారు. ఇక పోసాన్ పల్లి నుంచి సిద్దిపేటలోని చింతమడక గ్రామానికి తాత వెళ్లి ఐదారు వందల ఎకరాలు కొన్నారు. కేసీఆర్ పుట్టింది చింతమడకలోనే 1954లో జన్మించారు. మానేరు వాగుకు మాకు ఏదో అనుబంధం ఉంది. మానేరు వాగు మీద మొదట ప్రాజెక్టు కట్టినప్పుడు నానమ్మ భూములు పోయాయి. మిడ్ మానేరు ప్రాజెక్టు కడితే అమ్మమ్మ ఊరు కుదురుపాక మునిగిపోయింది. లోయర్ మానేరు డ్యాంలో ఇంకో అమ్మమ్మ(అమ్మ సోదరి) ఊరు మునిగిపోయిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఇవన్ఈన గుర్తు చేసుకున్న మంత్రికెటిఆర్ తన నానమ్మ వెంకటమ్మ జ్ఞాపకార్థంగా స్కూల్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు కేటీఆర్ ట్వీట్ చేశారు. నానమ్మను స్మరించుకోవడానికి ఇంతకంటే మంచి మార్గం గురించి ఆలోచించడం లేదన్నారు. నా గ్రామం -నా పాఠశాల కార్యక్రమం కింద తన సొంత ఖర్చులతో పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కామారెడ్డి జిల్లాలోని కోనాపూర్‌లో స్కూల్ భవనానికి ఇవాళ శంకుస్థాపన చేస్తున్నందుకు ఆనందంగా ఉందని కేటీఆర్ తన

# వైద్యరంగానికి నిధుల కేటాయింపులు

### పేదలకు చేరువగా వైద్యసేవలు: మంత్రి హరీష్ రావు



**మహబూబాబాద్, మే 10 (అక్షర వెలుగు):** వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఆస్తప్రుల్లో మౌళికవసతులకునిధులు వెచ్చిస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. పేదలకు ఐవద్యం ముంగిట్లోకి తీసుకుని రావాలన్నదే లక్ష్యమని అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానాలో రేడియాలజీ సేవల భవనం, 41 పడకల జనరల్ వార్డ్, డెడికేటెడ్ పీడియాట్రిక్ కేర్ యూనిట్ ప్రారంభించారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, పెద్ది సుదర్శన్ రెడ్డి, టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతు బంధు లేదు, ఇక్కడ అమలయ్యే పథకాలు లేవని మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. దమ్ముంటే అక్కడ పథకాలు అమలు చేసి ఇక్కడ మాట్లాడాలని సవాల్ విసిరారు. గిరిజన తండాల అభివృద్ధికి వెయ్యికోట్లు ఖర్చుచేస్తామని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా అణగదొక్క బడ్డదని, ఆ పాపంలో తాము కూడా ఉన్నామని తెలిపారు. అప్పటి పార్టీలు చెప్పినట్టు నడుచుకోవాల్సివచ్చిందని వివరించారు. పిచ్చికూతలు కూసే కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలను తిప్పికొట్టాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

## సినిమా థియేటర్లపై పోలీసుల తనిఖీలు

### నిబంధనలకు విరుద్ధంగా నడిచే థియేటర్లు సీజ్ !!



**కరీంనగర్, మే 10 (అక్షర వెలుగు):** రెండు సంవత్సరాలుగా కరోనా మహమ్మారి వల్ల సినిమాలకు దూరంగా ఉన్న జనం ఇటీవలే కరోనా కాస్త విరామం ఇవ్వడంతో ఊపిరి పీల్చుకుని, వినోదం కోసం థియేటర్లకు వెళ్లడం ప్రారంభించారు. ఇదే సమయంలో భారీ బడ్జెట్ సినిమాలు కూడా రిలీజ్ కావడంతో ప్రజలు థియేటర్లలో సినిమాలు చూడటానికి ఆసక్తి కనబరుస్తూ పెద్ద ఎత్తున థియేటర్లకు వెళ్లడం మొదలుపెట్టారు. దురదృష్ట వశాత్తూ, కరీంనగర్‌లో ఉన్న సినిమా థియేటర్లు యజమానులు కనీస నిబంధనలు పాటించకుండా, లైసెన్సులు కూడా రినీవల్ చేయించుకోకుండా సినిమా థియేటర్లను నడుపుతున్నారని అందిన ఫిర్యాదుల మేరకు కరీంనగర్ సిటీలో (9) ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కరీంనగర్ లోని ఈ సినిమా థియేటర్లు తనిఖీ చేయడం జరిగింది. ప్రతిమ మల్టీప్లెక్స్, శ్రీనివాస్ మల్టీప్లెక్స్, మమత థియేటర్, తిరుమల థియేటర్, శివ థియేటర్, సాయి కృష్ణ థియేటర్, తిరందాసు థియేటర్, వెంకటేశ్వర థియేటర్ తనిఖీలలో సినిమా థియేటర్ యజమానులు ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలు, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా చేపట్టే చర్యలు సీసీ కెమెరాల పనితీరు థియేటర్ కు వెళ్లే ప్రేక్షకులను క్షుణ్ణంగా తనిఖీ చేసే యంత్రాలు అగ్ని ప్రమాదం లాంటి సంఘటనలు జరిగితే ప్రజలు సురక్షితంగా ఉండడానికి తీసుకునే చర్యలు, ప్రేక్షకులు వినోదం కోసం థియేటర్లకు వచ్చినప్పుడు వారికి కనీస సౌకర్యాల కల్పన పరిశుభ్రత మరియు సినిమా థియేటర్ నడపడానికి కావలసిన లైసెన్స్, ఆర్ అండ్ బి అధికారులు తనిఖీ చేసి బిల్డింగ్ పటిష్టత గురించి జారీ చేసిన సర్టిఫికెట్ మరియు ఫైర్ డిపార్ట్మెంట్ వారు తనిఖీ చేసే ఫైర్ సేఫ్టీ కి సంబంధించి జారీ చేసిన సర్టిఫికెట్ మొదలైన వాటిని పరిశీలించగా చాలా థియేటర్లలో కనీస నిబంధనలు పాటించక పోవడం దృష్టికి వచ్చింది. వేసవిలో ఇంటిల్లిపాది వినోదం కోసం థియేటర్లకు పెద్దఎత్తున వెళ్ళినప్పుడు దురదృష్టవశాత్తు అనుకోని సంఘటనలు జరిగితే ప్రజలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొనిఎటువంటి నిబంధనలు పాటించని థియేటర్లను సీజ్ చేయడం జరిగింది.

## మరుగున పడ్డ చరిత్రకు నూతనోత్సాహం




**కరీంనగర్, మే 10 (అక్షర వెలుగు):** స్థానిక ఎస్సారార్ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో తెలంగాణలో నూతన శిలాజాల అన్వేషణ మరియు వెలుగుచూడని తెలంగాణ చరిత్ర అనే అంశంపై ఒక్కరోజు కార్యశాల (వర్క్ షాప్) జరిగింది. ఈ కార్యశాలకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డా.కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ ప్రామాణిక రీతిలో చరిత్ర రచన జరిగితే నిజమైన తెలంగాణ చరిత్ర వెలుగులోకి వస్తుందన్నారు. ప్రధాన వక్తగా విచ్చేసిన తెలంగాణ టీం ఆఫ్ రీసర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్ "(టార్చ్) ప్రధాన కార్యదర్శి అరవింద్ ఆర్య మాట్లాడుతూ మనకు తెలియని గత వైభవం ఎంతో ఉందని పరిశోధనల్లో అనేక చారిత్రక వాస్తవాలు బయట పడుతున్నాయని పేర్కొన్నారు.ఈ మేరకు టార్చ్ సంస్థతో ఎస్సారార్ కళాశాల చరిత్ర విభాగం పరస్పర అవగాహన ఒప్పందం చేసుకున్నారు. మరొక వక్త సునిల్ చారిత్ర నిర్మాణంలో పురావస్తు ఆధారాల ఆవశ్యకత వివరించారు. కార్యశాల నిర్వాహకులు చరిత్ర విభాగాధిపతి కె. సుధాకర్ మాట్లాడుతూ "చరిత్ర పరిశోధన పరంగా తెలంగాణ ఒక అక్షయ పాత్ర" లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం. హిమ బిందు, తెలుగు విభాగాధిపతి డా?కె. మల్లారెడ్డి ,ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా. ఎస్. ఓదెలు కుమార్, డా. కె. సురేందర్ రెడ్డి, డా. టి. శంకర్ , డా.ఏ.శ్రీనివాస్ కన్వీనర్లు ఏ. రామకిషన్,జి. రాజేందర్ మరియు అధ్యాపకులు కె.రాజేంద్రం, ఎం గోపాలకృష్ణ, పి. రాజు, నాయుడు, రామకృష్ణ, ప్రదీప్ శ్రవణ్, ప్రవీణ ,ఉమ మహేశ్వరి, మురళి,డా. వి. భిక్షపతి, డా. ఏ.సతీష్ కుమార్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయేతర రంగాలపై దృష్టిసారించి ధనవంతులు కావాలి

### జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్



**కరీంనగర్, మే 10 (అక్షర వెలుగు):** వ్యవసాయేతర రంగాలపై దృష్టి సారించి సహకార బ్యాంకింగ్ కార్యకలాపాలను విస్తృతం చేసి, భారీ లాభాలను ఆర్జించడం ద్వారా ధనవంతులు కావాలని ఉత్తరప్రదేశ్ సహకార అధికార ప్రతినిధి బృందానికి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ పట్టణంలోని కరీంనగర్ జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌లో ఉత్తరప్రదేశ్ సహకార అధికారుల ప్రతినిధి బృందం యొక్క ఎక్స్పోజర్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అర్.వి. కర్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాలకు ఆర్థికంగా సహాయం చేయడంతో పాటు వ్యవసాయేతర రంగాలకు సహాయాన్ని అందించడంలో డీసీసీబీ పాత్రను విస్తృతం చేయాలన్నారు. తమ డిసిసిబి కార్యకలాపాలను వైవిధ్యపరచాలని యుపి బృందానికి విజ్ఞప్తి చేస్తూ, వాణిజ్య బ్యాంకులతో సమానంగా మహిళా ఎస్‌హెచ్‌జిలు, గృహాలు, బంగారు ఋణాలు మరియు విద్యా ఋణాలు మొదలైన వాటికి ఋణాలు ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన తెలియజేశారు. కరీంనగర్ డీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు డీసీసీబీ పనితీరులో సంస్కరణలు తీసుకొచ్చి దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారని, పెండింగ్‌లో ఉన్న రుణాల రికవరీలో సహకార చట్టం చాలా శక్తివంతమైనదని, జిల్లాలో తెలంగాణ దళిత బంధు పథకం ద్వారా సుమారు 20 వేల మంది లబ్ధిదారులకు రూ.2 వేల కోట్ల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సహకార బృందం అధనపు కమీషనర్ మరియు అదనపు రిజిస్ట్రార్-బ్యాంకింగ్ బి. చంద్రకళ మాట్లాడుతూ దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచిన కరీంనగర్ డీసీసీబీలోన ఉత్తమ విధానాలను అనుసరిస్తామని, సహకార సంఘాల విస్తరణ, పీఏసీఎస్‌లను బహుళ సేవా కేంద్రాలుగా మార్చడం ద్వారా వాటి బలోపేతంపై దృష్టి సారిస్తామని తెలిపారు. యూపీ రాష్ట్ర సహకార రంగ బ్యాంకుల్లో కూడా కేడీసీసీబీ ఫార్ములాను పునరావృతం చేస్తామని ఆమె పేర్కొన్నారు. అనంతరం దేశంలోనే అత్యుత్తమ పీఏసీఎస్‌గా అవతరించిన చొప్పదండి పీఏసీఎస్‌ను యూపీ బృందం సందర్శించింది. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సహరాన్‌పూర్ చైర్మన్ రాజ్‌పాల్ సింగ్, డీసీసీబీ జలౌన్ చైర్మన్ ఉదయ్ సింగ్ పిండారీ, డీసీసీబీ ఫరూకాబాద్ చైర్మన్ కుల్దీప్ గంగ్వార్, డీసీసీబీ మీరట్ చైర్మన్ మణీందర్ పాల్ సింగ్, డీసీసీబీ ఝాన్సీ చైర్మన్ జైదేవ్ పురోహిత్, డీసీసీబీ బల్లియా చైర్మన్ వినోద్ శంకర్ దూబే, వీకే మిశ్రా (ఎండీ, యూపీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్), సింగ్ (చీఫ్ జనరల్ మేనేజర్, రాష్ట్ర సహకార బ్యాంకు), కులశ్రేష్ఠ (అదనపు కమిషనర్ మరియు అదనపు రిజిస్ట్రార్-లీగల్), సూర్య నారాయణ్ మిశ్రా (అసిస్టెంట్ కమిషనర్ మరియు అసిస్టెంట్ రిజిస్ట్రార్, కోఆపరేటివ్, లఖింపూర్ ఖేరీ). సాధన సింగ్ (అసిస్టెంట్ కమీషనర్ మరియు అసిస్టెంట్ రిజిస్ట్రార్, సహకార, ప్రధాన కార్యాలయం), వీరేంద్ర నారాయణ్ దివేది (అదనపు జిల్లా సహకార అధికారి, బ్యాంకింగ్), DCCB CEO లు, NABARD DGM లు కూడా పాల్గొన్నారు.

## పేదింట్లో కళ్యాణలక్ష్మి కాంతులు

- అడబిడ్డలకు అండగా తెలంగాణ సర్కారు
- పేదింటి అడబిడ్డలకు మేన మామ.. మనసున్న మారాజు కేసీఆర్.
- బీజేపీ పాలిత ప్రాంతాల్లో కల్యాణ లక్ష్మీ, రైతుబంధు పథకాలు అమలవుతున్నాయా?
- యూపీ ,గుజరాత్ రాష్ట్రాల్లో తాగునీటికి కటకట
- హుజూరాబాద్ కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి గంగుల



**కరీంనగర్, మే 10 (అక్షర వెలుగు):** తెలంగాణ సర్కారు నిరుపేద కుటుంబాలకు కళ్యాణలక్ష్మి అందజేస్తూ అండగా ఉంటుందని శిశు సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంగళ వారం హుజురాబాద్ సాయి రూప గార్డెన్ లో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 500 మంది లబ్ధిదారులకు సుమారు 5 కోట్ల విలువ గల కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి తో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ బిజెపి పాలిత ప్రాంతాల్లో కళ్యాణ లక్ష్మి, రైతుబంధు వంటి పథకాలు ఉన్నాయా అని ప్రశ్నించారు... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా నిరుపేద ఆడబిడ్డలకు అండగా నిలుస్తుందని వెల్లడించారు.. పేదింటి ఆడబిడ్డలకు గొప్పవరం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలని అన్నారు..బడుగు, బలహీన వర్గాల ఆడబిడ్డల వివాహాలకు ఇబ్బంది కలుగకుండా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే.సి.ఆర్ ఒక మేనమామ లాగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా 1,00,116/- రూపాయలను అందజేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 8 సంవత్సరాలు అవుతున్నదని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని మంత్రి తెలిపారు. పేదలు రెక్కడితే గానీ డొక్కాడదు, ఎక్కువ డబ్బు ఉండదని అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి కే.సి.ఆర్. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పేదింటి ఆడబిడ్డల కోసం ప్రవేశపెట్టారని తెలిపారు. అలాగే ఆసరా పెన్షన్, వృద్ధాప్య పెన్షలను కూడా ప్రవేశపెట్టారని మంత్రి అన్నారు. మాతా శిశు సంరక్షణరక్షణ కేంద్రంలో తొలి కాన్పుకు కే.సి.ఆర్. కిట్లు ఇస్తున్నామని, మగ బిడ్డ జన్మిస్తే రూ.12 వేలు, ఆడబిడ్డ జన్మిస్తే రూ.13 వేలు అందజేస్తున్నరని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడి కౌశిక్ రెడ్డి , కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ,జెడ్పి చైర్మన్ కనమల్ల విజయ ,అడిషనల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ ఆయా మండలాలతహశీల్దార్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేకుర్తి 18, 19 వ డివిజన్ పరిదిలోని పలు చోట్ల 5 కోట్ల రూ. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

త్వరలోనే రెండు డివిజన్ల ప్రజలకు మంచి నీటి సమస్య తీరనుంది.

దశలవారికా రేకుర్తి అన్ని కాలనీల్లో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం.

19 వ డివిజన్ రేకుర్తిలో 23 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంబించిన మేయర్ సునిల్ రావు.



**కరీంనగర్, మే 10 (అక్షర వెలుగు):** రేకుర్తి గ్రామ పంచాయితీలో ఎదుర్కొన్న సమస్యలు కార్పోరేషన్ లో విలీన మైన తర్వత ప్రజలు ఎదుర్కోవద్దని నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. నగర మేయర్ యాదగరి సునిల్ రావు. కరీంనగర్ అభివృద్ధిలో భాగంగా మంగళవారం రోజు 19 వ డివిజన్ రేకుర్తిలో పర్యటించారు. స్థానిక కార్పోరేటర్ ఏదుల్ల రాజశేఖర్ తో కలిసి 23 లక్షల నగరపాలక సంస్థ నిధులతో అభివృద్ధి పనులకు భూమీ పూజ చేశారు. మొదటగా రేకుర్తిలోని షేఖ్ నభీ కాలనీలో 13 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, విజయపురి కాలనీలో 10 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ, కల్వర్టు పనులను ప్రారంభించారు. చేపట్టిన పనులను నాణ్యతగా, చక్కటి క్యూరినేషన్ తో వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సంధర్బంగా మేయర్ సునిల్ రావు మాట్లాడుతూ... రేకుర్తి పరిదిలో గల 18,19 డివిజన్ల ప్రజల సమస్యలన్నిటీని దశల వారిగా పరిష్కరిస్తామన్నారు. గ్రామపంచాయిలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు విలీనం చెందిన తర్వత ఎదుర్కోవద్దని ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. డివిజన్ల పరిదిలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేసేమదుకు 5 కోట్ల రూ. నిధులు కూడ మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే అన్ని అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి చేసి... వాటి పనులు కూడ ప్రారంభిస్తామన్నారు. రేకుర్తిలోని రెండు డివిజన్లకు త్వరలోనే మంచి నీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం లబించిందన్నారు. శాతవాహన యూనివర్సిటీ నుండి అంభేడ్కర్ విగ్రహాం వరకు నూతనంగా వేస్తున్న పైపులైన్ పనులు కూడ పూర్తయ్యాయన్నారు. మరో వైపు ఆర్టీసి వర్క షాప్ మేయిన్ రోడ్డు వెంబడి రేకుర్తి బస్టాప్ వరకు కూడ పైపులైన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. త్వరలోనే పైపులైన్లకు ఇంటర్ కనెక్షన్లు ఇచ్చి రేకుర్తి డివిజన్ ప్రజలకు మంచి నీరు త్వరలో అందిస్తామన్నారు. రేకుర్తి ప్రాంతం చాలా ఎత్తు పల్లాలతో కూడి ప్రాంతం మరియు గుట్టలతో కూడిన ప్రాంతంలు కాబట్టి దశల వారిగా ఒక్కొక్క ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు మంచి వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నగరపాలక సంస్థలో నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదు కాబట్టి వీలిన చట్టంలో ఉన్న ప్రకారం నిధులు కేటాయించి వీలీనమైన ప్రాంతాల్లోని అన్ని డివిజన్ల అభివృద్ధి చేస్తామన్నారు. గతంలోనే రెండు డివిజన్ల పరిదిలో ప్రజలు చీకటిలో ఉండ కుండ అన్ని ప్రాంతాల్లో ఎల్ఈడీ ఐమాస్ లైట్లను కూడ అమర్చడం జరిగిందన్నారు. రేకుర్తి పరిదిలోని రెండు డివిజన్లలో మొదటగా ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేస్తామన్నారు. మురికి కాలువలు నిర్మాణం చేసి, అవసరం ఉన్న చోట క్రాస్ కల్వర్టు నిర్మాణం చేసిన తర్వతా సీసీ రోడ్లను వేస్తామని తెలిపారు. గ్రామపంచాయితో ఉన్నప్పుడు ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు కార్పోరేషన్ ఎదుర్కోకుండ ప్రత్యేక చర్యలు తీస్కుంటున్నామన్నారు. వీలీన గ్రామాలన్నిటీని నగరంతో సమానంగా అభివృద్ధి చేసి ప్రజలకు వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గతంలోని రేకుర్తి సమస్మక్క సారలమ్మ జాతరకు కోటి రూ. తో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి. జారతకు అమ్మవార్లను దర్శించుకునేలా వసతి కల్పించామన్నారు. యూనివర్సిటీ నుండి అంభేడ్కర్ స్టేడియం వరకు పెద్ద డ్రైనేజీ నిర్మాణం పనులు త్వరలో ప్రారంబించి మురుగు నీరు సులువుగా వెల్లే విధంగా చర్యలు చేపడుతామన్నారు.18,19 డివిజన్ల కార్పోరేటర్లు మా దృష్ఠికి తెచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ ఎదుల్ల రాజశేఖర్, డీఈ మసూద్ అలీ, ఏఈ గంగాధర్, వర్క్ ఇన్ స్పెక్టర్ ఖాలీద్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఖ్యాతినిపెంచిన కెటిఆర్

### మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రశంసలు

**కామారెడ్డి, మే 10 (అక్షర వెలుగు):** తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచంలోనే 10 శాతం పెంచిన వ్యక్తి మంత్రి కేటీఆర్ అని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం బీబీ పేట మండలం కోనాపూర్‌లో నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ...బీబీపేట మండలంలోని కొనాపూర్‌లో కేటీఆర్ నానమ్మ జ్ఞాపకార్థం రూ.2 కోట్లతో పాఠశాలను నిర్మించడం గర్వించదగ్గ విషయమన్నారు. వందల ఎకరాల భూములు కలిగిన కుటుంబంలో జన్మించిన వ్యక్తి కేసీఆర్అని చెప్పుకొచ్చారు. మహబుబ్‌నగర్‌లో సున్నాలు వేసుకొనేటోడు, నిజామాబాద్‌లో చందాలు వసూలు చేసుకొనేటోడు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ఖబర్దార్.. టీఆర్ఎస్ కార్యకర్తలు మీకు తగిన బుద్ధి చెబుతారు అంటూ మంత్రి ప్రశాంత్ రెడ్డి హెచ్చరించారు. బిజెపి తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. ఊకదంపుడు మాటలతో ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. ఇలాంటి వారికి ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు.

## ఫుట్‌పాత్, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తే కఠిన చర్యలు

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ



**కరీంనగర్, మే 10 (అక్షర వెలుగు):** ఫుట్‌పాత్‌లు రోడ్లను ఆక్రమిస్తూ వ్యాపారాలు నిర్వహించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ అన్నారు. ఫుట్ పాత్ లు, రోడ్లపై ఆక్రమణల తొలగింపు కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. మంగళవారం కరీంనగర్ లోని ప్రతిమ మల్టీప్లెక్స్ నుండి తెలంగాణ చౌక్, ఆర్అండ్ బి గెస్ట్ హౌస్‌ల మీదుగా ఎస్ఆర్ఆర్ కళాశాల, బస్టాండ్ నుండి కమాన్ వరకు రోడ్లకు ఇరువైపులా ప్రాంతాలను పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరిమ అగర్వాల్ లతో కలిసి పర్యటించారు. వారిరువురి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఫుట్ పాత్, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ మాట్లాడుతూ ఫుట్ పాత్, రోడ్లను ఆక్రమిస్తూ వ్యాపారాలు నిర్వహించడం వల్ల పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులేర్పడుతున్నాయరు. ఈ ఆక్రమణలతో ప్రమాదాల సంఖ్య కూడా పెరిగిపోతుందని చెప్పారు. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు రోడ్ల విస్తరణ,వివిధ రకాల ఆధునీకరణ పనులను కొనసాగిస్తుందని తెలిపారు. ఈ ఆక్రమణలతో ప్రయోజనం లేకుండా పోతున్నదని పేర్కొన్నారు. ఫుట్ పాత్ లు, రోడ్లను ఆక్రమించే వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూపినా ఆక్రమణలు కొనసాగుతుండటం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో లో అడిషనల్ డిసిపి ఎస్ శ్రీనివాస్, ఏసిపి లు తుల శ్రీనివాస రావు, మదన్ లాల్, కాశయ్య, విజయ్ కుమార్ లతో పాటుగా పలువురు పోలీసు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## హాజ్ యాత్రికులకు మెరుగైన సౌక్యరాలు కల్పించడానికి కృషి చేస్తాం

### సయ్యద్ గులాం ఆహ్మద్ హుస్సేన్, రాష్ట్ర హాజ్ కమిటి సభ్యులు




**కరీంనగర్, మే 10 (అక్షర వెలుగు):** తెలంగాణ రాష్ట్రం నుండి ప్రతి సంవత్సరం హాజ్ యాత్రకు వెళ్లే వారికి హాజ్ కమిటి ద్వారా మెరుగైన సౌక్యరాలు కల్పించడానికి కృషి చేస్తానని హాజ్ కమిటి సభ్యులు, ఎంఐఎం కరీంనగర్ నగర అధ్యక్షులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. హాజ్ కమిటి సభ్యునిగా నియమితుడైన సందర్భంగా మంగళవారం నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరంలో రాష్ట్రం నుండి 1822 మంది హాజ్ యాత్రకు వెళ్ళతున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, ఎఐఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షులు, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, రాష్ట్ర హెూంశాఖ మంత్రి ముహహ్మద్ అలీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బొయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మెన్ మొహమ్మద్ మసిఉల్లాహ్ ఖాన్, హాజ్ కమిటి చైర్మెన్ మొహమ్మద్ సలీంల సహకారంతో రాష్ట్ర కోట పెంచడానికి కృషి చేస్తానన్నారు. సిద్దిపేటలో మంత్రి హరిష్‌రావు నిర్మించిన ప్రకారం కరీంనగర్‌లో హాజ్ హౌస్ ను మంత్రి గంగుల కమలాకర్ సహకారంతో నిర్మించడానికి కృషి చేస్తానని అన్ని వర్గాల ప్రజల కోసం పాటుపడుతున్న కెసిఆర్ హాజ్‌హుజ్ నిర్మిణానికి నిధులు కేటాయిస్తారనే నమ్మకం తనకు ఉందన్నారు. హాజ్ యాత్రలో ఎవరికి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడానికి కమిటి ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. హాజ్ యాత్రకు వెళ్లే వారు ఫోన్ ద్వారానైన నేరుగానైనా తనను సంప్రదిస్తే తగిన సలహాలు, సూచనలు, సహకారాన్ని అందిస్తానన్నారు. హాజ్ కమిటిలో తనకు స్ధానం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్,ఎఐఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షులు, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, హెూంశాఖ మంత్రి ముహమ్మద్ అలీ, బొయినపల్లి వినోద్‌కుమార్‌లతోపాటు సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హాజ్ కమిటి సభ్యుడిగా నియమితులైన సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్‌ను ముస్లీం నాయకులు, ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సత్కారించారు. ఈ సమావేశంలో తబ్లీఖ్ జమాత్ సదర్, మహ్మద్ అబ్దుల్ రహిమొద్దీన్, మౌలాన ఖయ్యూమ్ జీయాయి. అహ్లెసున్నతుల్ జమాత్ హాఫెజ్, సయ్యద్ మొయిజోద్దీన్ ఖాద్రి, సీనియర్ సిటిజన్ అ్యధ్యక్షులు మొహహ్మద్ నసీమోద్దీన్, ముతవల్లి కరీముల్లాహ్ షషా దర్గా మన్నాన్ తవక్కలి, అహ్లెహాదీస్ అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ సమి ఎంఐఎం పార్టీ నాయకులు, కార్పోరేటర్లు, ఉమ్మడి జిల్లా పరిధిలోని జగిత్యాల, కోరుట్ల, పెద్దపల్లి, మెట్‌పల్లి, రామగుండం, సిరిసిల్లలకు చెందిన ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గోన్నారు.


## భూసారాన్ని పెంపొందించుకుంటేనే అధిక దిగుబడి సాధ్యం



**చండూర్, మే 10 (అక్షర వెలుగు):** భూసారాన్ని పెంపొందించుకుంటేనే అధిక దిగుబడి వస్తుందని జిల్లా సహాయ వ్యవసాయ అధికారి యల్లయ్య అన్నారు. మంగళవారం చండూర్ మండలం లోని కస్తాల రైతు వేదిక లో గ్లోబల్ అగ్రి ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఫార్మ్ వారు నిర్వహించిన రైతు అవగాహన సదస్సు లో పాల్గొని మాట్లాడుతూ గ్లోబల్ అగ్రి ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఫార్మ్ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం అభినందనీయమనీ, రైతులు సాగు చేసే క్రమంలో సరైన మేలకువలు పాటించి అధిక దిగుబడులు పొందాలని, ఇలాంటి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని, భూసార పరీక్షలు రైతులు చేయించుకోవడం వలన అనేక ఉపయోగాలు ఉన్నాయని, వర్షాకాలంలో వేసే పంటలకు నాణ్యమైన విత్తనాలని ఎంపిక చేసుకోవాలని అన్నారు. ఎంపీపీ పల్లె కళ్యాణి రవి కుమార్ మాట్లాడుతూ లో దుక్కులు వేసుకోవడం వలన సూక్ష్మ క్రిములు పోయి భూమి గుల్ల బారుతుందని, వర్షపు నీళ్లు భూమి అంతర్భాగంలో కి వెళ్లి భూమి తేమ కలిగి వర్షాకాలంలో వేసుకునే పంటలకు మేలు జరుగుతుందన్నారు. ఏ రాష్ట్రం లో లేని విదంగా తెలంగాణ ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించి రైతులకు శిక్షణ ఇస్తుందని, రైతు వేదిక లను క్లస్టర్ వారీగా రైతు లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్లోబల్ అగ్రి ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఫార్మ్ అధ్యక్షులు నెల్లికంటి రాఘవేంద్ర యాదవ్ మాట్లాడుతూ మా సంస్థ రైతులకు,అధికారులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. పంట మార్పుతోనే భూమి భూసారం పెరిగి సాగు చేసిన పంట అధిక దిగుబడులకు సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో మల్లేశం, రైతులు మందడి నర్సిరెడ్డివైస్ ఎంపీపీ, మండల రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు వెంకన్న, ఎంపీటీసీ పల్లె వెంకన్న, మెండు వెంకటరెడ్డి, గుండమళ్ళ శ్రీనివాస్ ఏ ఇ ఓ లు, గ్లోబల్ అగ్రి ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఫార్మ్ ప్రధాన కార్యదర్శి పగడాల నాగయ్య, గౌరవ సభ్యులు దేవరకొండ వెంకన్న, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.




# చలన చిత్రం



## 'మ మ మహేషా' పాటకు భారీ రెస్పాన్స్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు , కీర్తి సురేశ్ జంటగా పరశురామ్ పెట్లా దర్శకత్వంలో రూపొందిన మాస్ ఎంటర్‌టైనర్ సర్కారు వారి పాట మరికొన్ని గంటల్లో ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా 'మ మ మహేషా' అంటూ సాగే మాంచి మాస్ సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మే 12 న సినిమా రిలీజ్ కాబోతుండటంతో అందరూ సర్కారు వారి పాట కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. మరి ఈ చిత్రం మహేశ్ కెరీర్‌లో ఎలాంటి రికార్డ్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి.మహేశ్ బాబు నటించిన పోకిరి సినిమా నుంచి తప్పనిసరిగా మాస్ ఆడియన్స్ కోసం దర్శకులు ఓ మాస్ సాంగ్‌ను పెడుతున్నారు. ఈ సాంగ్స్ ప్రేక్షకులను ఎంతగానో మెప్పిస్తున్నాయి. పోకిరి సినిమాలో పూరి ప్లాన్ చేసిన సాంగ్స్ ఎంతగా హిట్ అయ్యాయో అందరికీ తెలిసిందే. ఆ తర్వాత వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రాలు శ్రీమంతుడు, భరత్ అనేను, మహర్షి, సరిలేరు నీకెవ్వరు లాంటి సినిమాలలోనూ కూడా హీరోయిన్‌తో ఆన్‌స్క్రిన్ రొమాన్స్ చేసిన మహేశ్ మాస్ సాంగ్స్‌కు సాలీడ్ రెస్పాన్స్ వచ్చింది. హాలీవుడ్ హీరోలా క్లాస్‌గా కనిపించే మహేశ్ సినిమాలో ఒక్క మాస్ అయినా ఉండాల్సందే..అనేలా అభిమానులు, ప్రేక్షకులు ఫిక్సైయ్యారు. ఆ విధంగానే మేకర్స్ కూడా మహేశ్‌ను సీన్స్‌లో, సాంగ్స్‌లో మాస్ యాంగిల్ చూపించి సర్‌ప్రైజ్ ఇస్తున్నారు.ఈ క్రమంలోనే మహేశ్ - కీర్తి సురేశ్‌ల మీద సర్కారు వారి పాట సినిమాలో దర్శకుడు పరశు రామ్ - మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ ఎస్ థమన్ చేసిన 'మ మ మహేషా' అనే సాంగ్ లిరికల్ వీడియోకు ఊహించని విధంగా రెస్పాన్స్ వచ్చింది. యూట్యూబ్‌లో ఈ సాంగ్ కేవలం రెండు రోజుల్లోనే 21 మిలియన్ వ్యూస్ రాబట్టి సరికొత్త రికార్డ్ సెట్ చేసింది. దాంతో చిత్రబృందం ఈ విషయాన్ని సోషల్ మీడియాలో తెలుపుతూ పోస్ట్ పెట్టింది. ఇప్పటివరకు ఏ సినిమాలోనూ కీర్తి కనిపించని మాస్ లుక్స్‌లో కనిపించడం ఈ సాంగ్‌కు పెద్ద ప్లస్ పాయింట్ అని అందరూ చెప్పకుంటున్నారు. ఇక మహేషా సాంగ్ థియేటర్స్‌లో ఆడియన్స్‌కు మాంచి విజువల్ ట్రీట్ ఇవ్వడం గ్యారెంటీ అందరూ ఫిక్సయ్యారు.



## ఏజెంట్ కమర్షియల్ హిట్ ఇచ్చేనా ?

అక్కినేని నట వారసుడు అఖిల్ కమర్షియల్ హిట్టు కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాడు. కెరీర్ ఆరంభం నుంచి వరుస ప్లాపుల్లో ఉన్న అఖిల్‌కు 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' కాస్త ఊరటనిచ్చింది. కానీ ఈ చిత్రం అఖిల్‌కు మాత్రం కమర్షియల్ హిట్టును ఇవ్వలేకపోయింది. దాంతో ఈ సారి ఎలాగైనా బ్లాక్‌బస్టర్ హిట్టు కొట్టాలని సురేందర్ రెడ్డితో చేతులు కలిపాడు. ప్రస్తుతం వీళ్ళ కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'ఏజెంట్'. అఖిల్ ఈ చిత్రం కోసం పూర్తిగా మేకోవర్ అయినట్లు గతంలో విడుదలైన పోస్టర్‌లను చూస్తే తెలుస్తుంది. కండలు తిరిగిన దేహంతో అఖిల్ 'రా ఏజెంట్'గా ఈ చిత్రంలో కనిపించనున్నాడు. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 12న విడుదల చేయనున్నట్లు గతంలోనే ప్రకటించారు. కానీ తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఏజెంట్ చిత్రం విడుదల తేదీని వాయిదా వేసినట్లు తెలుస్తుంది. ఈ చిత్రం విడుదల వాయిదా పడటానికి అనేక కారణాలే ఉన్నాయి. ఇటీవలే అఖిల్‌కు చిన్న గాయం కావడంతో షూటింగ్‌కు బ్రేక్ వచ్చింది. అంతేకాకుండా ఈ చిత్రం అనౌన్స్ చేసినప్పటి నుంచి షూటింగ్ పలుమార్లు వాయిదా పడుతూ వస్తుంది. ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు ప్రధానంగా ఉండటంతో షూటింగ్‌కు చాలా సమయం పడుతుంది. దాంతో చిత్ర బృందం విడుదలను వాయిదా వేసిందట. దీనిపై త్వరలోనే అధికారికంగా ప్రకటన రానుంది. మలయాళ స్టార్ మమ్ముట్టి కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌తో కలిసి సురేందర్ రెడ్డి స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్నాడు. అఖిల్‌కు జోడీగా సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటిస్తుంది.




## లైగర్ సినిమాకు సంగీతం ఎవరో ?

టాలీవుడ్ రౌడీ హీరోగా అర్జున్ రెడ్డి సినిమాతో పాపులారిటీ తెచ్చుకున్న విజయ్ దేవరకొండ సెన్సేషనల్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కలిసి చేస్తున్న పాన్ ఇండియన్ సినిమా లైగర్. 'సలా క్రాస్ బ్రీడ్' అనే ఉప శీర్షికతో రూపొందుతున్న ఈ సినిమాను ఒకేసారి హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో రూపొందిస్తున్నారు. భారీ స్థాయిలో ఆగస్టు 25న ప్రపంచవ్యాప్తంగా ఈ పాన్ ఇండియా సినిమాను థియేటర్లలో విడుదల చేయబోతున్నట్టు మేకర్స్ ఇది వరుకే ప్రకటించారు. అయితే, ఇప్పటి వరకు అన్నీ విషయాలలో క్లారిటీ ఇచ్చిన పూరి, మ్యూజిక్ డైరెక్టర్ విషయంలో మాత్రం ఇంకా సస్పెన్స్ మేయింటైన్ చేస్తున్నారు. సాధారణంగా పూరి జగన్నాథ్ సినిమాకు కాస్ట్ అండ్ క్రూ ముందుగానే ఫిక్సైపోతుంది. టైటిల్స్‌లో చిత్ర సంగీత దర్శకుడి పేరునూ వేస్తారు. కానీ, లైగర్ చిత్రం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు ఈ మూవీకి సంగీతం అందిస్తుంది ఎవరో మాత్రం రివీల్ చేయలేదు. టాక్ మాత్రం సాంగ్స్‌కు బాలీవుడ్ సంగీత దర్శకుడు, బ్యాక్‌గ్రౌండ్ మాత్రం మణిశర్మ అందిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక తాజాగా ఈ సినిమా నుంచి హీరో విజయ్ దేవరకొండ బర్త్ డే సందర్భంగా హంట్ థీమ్ అంటూ ఓ లిరికల్ సాంగ్‌ను వదిలారు. దీనికి మాత్రం విక్రమ్ మాంట్రోస్ సంగీతం అందించినట్టు టైటిల్స్‌లో పేర్కొన్నారు. అయితే, ఇతనే అన్నీ సాంగ్స్ కంపోజ్ చేస్తాడా.. లేదా అనేది మాత్రం క్లారిటీ ఇవ్వలేదు పూరీ టీమ్. మరి ఈ విషయంలో పక్కాగా ఎప్పుడు క్లారిటీ వస్తుందో చూడాలి. కాగా, ఈ పాన్ ఇండియా సినిమాలో విజయ్ దేవరకొండ సరసన బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే హీరోయిన్‌గా నటించింది. లెజండరీ బాక్సర్ మైక్ టైసన్ లైగర్‌తో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రాన్ని పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ , కరణ్ జోహార్, అపూర్వ మెహతా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తుస్తున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com